క్లుప్తంగా

మట్టి ప్రతిమల పంపిణీ



మైలవరం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మైలవరం జమీందారు, ద్వారకా తిరుమల వంశపారంపర్య ధర్మకర్త ఎస్వీఎస్ నివృతరావు అన్నారు. మైలవరంలో మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గణనాథుని మట్టి ప్రతిమల ఉచిత పంపిణీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మట్టి ప్రతిమలను వినియోగించాలని కోరారు. ట్రస్ట్ నిర్వాహకురాలు కోయ సుధ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

● లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో కళాశాల యాజమాన్యం వినాయకుని మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. కళాశాల ప్రెసిడెంట్ జి. శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

● తిరువూరు: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక బోస్ సెంటర్లో శుక్రవారం మట్టి గణపతి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ తిరువూరు అధ్యక్షుడు పసుమర్తి వెంకటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో నిబంధనలు తప్పనిసరి

తిరువూరు: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో నిబంధనలు తప్పక పాటించాలని తిరువూరు సీఐ గిరిబాబు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని పలు గ్రామాల గణేశ ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి ఆయన పలు సూచనలు చేశారు. తహసీల్దారు లక్ష్మి, ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.


ఊటుకూరు ఊర చెరువుకు గండి పడటంతో బయటకు వెళుతున్న నీరు


పెనుగొలను ఊర చెరువుకు పడిన పెద్ద గండి


వినగడప రాళ్లచెరువుకు ఏర్పడిన గండి

కడగండ్లు

గంపలగూడెం: భారీ వర్షాలు, వరదలకు మండలంలోని వినగడప రాళ్ల చెరువు, ఊటుకూరు ఊర చెరువు, పెనుగొలను ఊర చెరువులకు భారీగా గండ్లు పడ్డాయి. మూడు చెరువుల కింద ఆయకట్టు భూమి మొత్తం 527.09 ఎకరాల్లో ఖరీఫ్ పైర్లు సాగు చేశారు. ఆయా చెరువుల కింద ప్రధానంగా వరి సాగు చేసి నెల రోజులు దాటింది. ఈ తరుణంలో చెరువులకు గండ్లు పడి చెరువు లోతట్టు పూర్తిగా ఖాళీ అయింది. గండ్లను త్వరితగతిన పూడ్చి సాగర్ జలాలతో చెరువులను నింపేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. దీనిపై పీడబ్ల్యూడీ ఏఈ టి. మానసను వివరణ కోరగా మూడు చెరువులకు తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.6 లక్షల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు పంపామన్నారు. మంజూరు కాగానే గండ్ల పూడ్చివేస్తామన్నారు.

ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాలని వినతి

తిరువూరు: భారీ వర్షాలతో తిరువూరు పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉందని, మురుగునీరు, వర్షం నీరు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు శుక్రవారం నగర పంచాయతీ కమిషనర్‌కు మెమోరాండం సమర్పించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు అరకొరగా చేయడంతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. వెంటనే అన్ని వార్డుల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని కోరారు. మురుగు కాలువలు శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లాలని, దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేసి ఎబేట్ మందు పిచికారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. రక్షిత మంచినీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు గుళ్ళపల్లి వెంకటరత్నం, ఆకుల రవి తదితరులు పాల్గొన్నారు.

అదనపు టీచర్ల సర్దుబాటుకు కౌన్సెలింగ్


ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎంఈఓ

ముసునూరు: ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో శుక్రవారం సర్దుబాటు కౌన్సెలింగ్ ద్వారా తొమ్మిది మంది ఉపాధ్యాయులకు పాఠశాలలను కేటాయించామని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు తెలిపారు. గుడిపాడు ఆర్‌సీఎం పాఠశాలకు టి. రత్నకుమార్, గోపవరం బీసీ ఎంపీ పాఠశాలకు మంజులాదేవి, హరిశ్చంద్రపురం పాఠశాలకు విష్ణువర్ధనరావు, కొర్లగుంట ఎంపీయూపీ స్కూల్‌కు విశాలాక్షి, వెంకటాపురం పాఠశాలకు రవికుమార్, చింతలవల్లి (ఎస్సీ) పాఠశాలకు శ్రీకాంత్, గోగులంపాడు ఎంపీయూపీ పాఠశాలకు వెంకటరత్నం, సౌజన్య, సూరేపల్లి గొల్లగూడెం పాఠశాలకు ప్రభాకర్‌ను నియమించామని ఎంఈఓ చెప్పారు. కేటాయింపు జరిగిన ఉపాధ్యాయులంతా తమ స్థానాల నుంచి రిలీవ్ అయి కొత్త స్థానాల్లో బాధ్యతలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ నేతలు గాంగేయుడు, ఉదయభాస్కర్, రామరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

9న టెన్నికాయిట్ సబ్ జూనియర్స్ జిల్లా సెలక్షన్స్

నూజివీడు: ఉమ్మడి కృష్ణా జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9న నూజివీడులోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో సబ్ జూనియర్ విభాగంలో బాలబాలికల జిల్లా జట్లను ఎంపిక చేస్తామని అసోసియేషన్ కార్యదర్శి దాసరి సూర్యనారాయణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మరిన్ని వివరాలకు సెల్: 79898 77355, 94406 96797నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

ఆర్థిక సాయం

కాచవరం(ఇబ్రహీంపట్నం): కృష్ణానది వరదనీటిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన బీహార్ వాసి గుడ్డు మంజి (24)కి రూ.5 లక్షలు మంజూరయ్యాయి. మృతుడి తల్లిదండ్రులు అందుబాటులో లేనందున ఆర్థికసాయం చెక్కును సర్పంచి దండుబోయిన రాజేంద్రప్రసాద్‌కు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ శుక్రవారం అందజేశారు. ఈ చెక్కును మృతుడి కుటుంబానికి అందించాలని ఆయన సూచించారు.

సాగర్ మేజరు కాలువ పూడిక తీత

తిరువూరు: నాగార్జున సాగర్ తిరువూరు మేజరు కాలువలో శుక్రవారం పొక్లెయినేతో పూడిక తీశారు. చెట్లు, ముళ్లకంపలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. ఎన్ఎస్పీ అధికారులు, సామాజిక కార్యకర్త ఉయ్యూరు జయప్రకాష్ పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

మైలవరం: మైలవరంలో వరద బాధిత 50 కుటుంబాలకు సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. సీఐటీయూ మైలవరం మండల కార్యదర్శి చాట్ల సుధాకర్, పుష్పకుమారి, సీహెచ్ శారద, ఎస్ సుధ పాల్గొన్నారు.

హోమియో మందులు అందజేత

తిరువూరు: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తిరువూరు పట్టణంలోని 8వ వార్డులో శుక్రవారం రోగ నిరోధక హోమియో మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కేబుల్ టీవీ అధినేత శివరామకృష్ణ వితరణతో హోమియో వైద్య నిపుణులు అనుమోలు పుష్పకుమారి పర్యవేక్షణలో వార్డులోని ఇంటింటికీ మందులను అందజేశారు.

నిర్వాహక కమిటీలతో సమావేశం

ఇబ్రహీంపట్నం: వినాయక చవితి ఉత్సవాల నిర్వాహక కమిటీలు ఉన్నతాధికారుల నియమ నిబంధనలు పాటించాలని ఎంపీడీఓ రామకృష్ణ నాయక్ అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉత్సవాల్లో పాటించాల్సిన విధానాలపై తహసీల్దార్ వై. వెంకటేశ్వర్లు, కొండపల్లి మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తనతో కలిసి గ్రామ స్థాయి కార్యదర్శులు, వీఆర్వోలకు సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించి పలు సూచనలు చేశారు.

వరద బాధితులకు వితరణ


కోడూరు గ్రామంలో అన్నదానం

జూపూడి(ఇబ్రహీంపట్నం): ఏపీఎస్ఈబీ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూపూడి, కిలేశపురంలో వరద బాధితులకు సమకూర్చిన నిత్యావసర వస్తువులను ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ నాగరాజు శుక్రవారం అందజేశారు.

● నల్గొండ జిల్లాకు చెందిన చిన్నతరహా రైస్‌మిల్లర్ల ఆధ్వర్యంలో ఫెర్రీ గ్రామంలో 1000 కిలోల బియ్యం బాధితులకు పంపిణీ చేశారు.

చాట్రాయి: వరద బాధితుల సహాయార్థం తుమ్మగూడెం ఉర్దూ పాఠశాల విద్యార్థులు హెచ్ఎం వెంకటేశ్వరరావు సూచనలతో శుక్రవారం గ్రామంలో విరాళాలు సేకరించారు.

● చాట్రాయి: చనుబండ కోదండ రామ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 130 కిలోల బియ్యం, 20 కిలోల కందిపప్పుని శుక్రవారం నూజివీడులోని మంత్రి కొలుసు పార్థసారథి కార్యాలయంలో అందజేశారు.

వైఎస్సార్ సీపీ అన్నదానం

జి.కొండూరు: కోడూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం అన్నదానం చేశారు. తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు

చింతలపాడు(తిరువూరు): తిరువూరు మండలం చింతలపాడు గుర్రపు వాగు వద్ద శుక్రవారం ఆర్టీసీ బస్సు ఢీకొని దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. గంపలగూడెం మండలం వినగడప వద్ద కట్టలేరుపై వరద రావడంతో గంపలగూడెంకు వెళ్లే నిమిత్తం కనుమూరుకు చెందిన అక్కల రాజగోపాలరెడ్డి భార్య శ్రీలక్ష్మితో కలిసి గానుగపాడు, చింతలపాడు మీదుగా ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. గుర్రపు వాగు వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన తిరువూరు డిపో బస్సు ఢీకొనడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను విజయవాడ ఆస్పత్రికి తరలించి తిరువూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

పౌష్టికాహారంపై అవగాహన

తిరువూరు: గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని తిరువూరు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి అన్నారు. తిరువూరు ఐసీడీఎస్ ప్రాజెక్టులో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. తిరువూరు ఇందిరా కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో రాజేశ్వరి మాట్లాడుతూ గర్భిణులు ఆకుకూరలు, పాలు, పండ్లు వంటి బలవర్ధక ఆహారం తీసుకుంటే ఆరోగ్యకరమైన బిడ్డ జన్మిస్తారన్నారు. పిల్లలకు సైతం సమగ్ర పౌష్టికాహారం అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుబాటులో ఉందని, మూడేళ్ల లోపు పిల్లలను తప్పక అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్త వెంకటేశ్వరమ్మ, తల్లులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ఆగిరిపల్లి: భారీ వర్షాల కారణంగా వాగులు, చెరువులు పొంగి ప్రవహిస్తున్నాయని, ప్రజలు వాగులు దాటి ప్రమాదాలకు గురికావద్దని ఏఆర్ డీఎస్పీ శ్రీహరిరావు అన్నారు. నూగొండపల్లిలోని కుంపిని వాగును, చిన్నాగిరిపల్లి, తోటపల్లిలోని వాగులను నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. వరదల సమయంలో అప్రమత్తంగా ఉండాలని, వాగులు దాటవద్దని చెప్పారు. వరదల కారణంగా ముందస్తుగా వాగులు, చెరువుల దగ్గర పోలీస్ సిబ్బంది ప్రజలకు అండగా ఉంటారని తెలిపారు.

తగ్గుముఖం పట్టిన బుడమేరు


వెలగలేరులో బ్లీచింగ్ చల్లుతున్న కార్మికుడు


కోతకు గురైన వెల్లటూరు ప్రధాన రహదారి

జి.కొండూరు: భారీ వర్షాలతో ఉగ్రరూపం దాల్చిన బుడమేరు శుక్రవారం సాయంత్రానికి తగ్గుముఖం పట్టింది. వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద నీటి మట్టం మూడు అడుగులకు చేరింది. అయినప్పటికీ డైవర్షన్ కెనాల్ ద్వారా ఐదు వేల క్యూసెక్కుల వరకు వరద నీరు ప్రవహిస్తోంది. కవులూరు గ్రామ శివారులో కాల్వకు పడిన భారీ గండి నుంచి పలు గ్రామాల మీదుగా ప్రవహిస్తుండటంతో ఆయా గ్రామాల పరిధిలోని 15 వేల ఎకరాలకు పైగా వరి, పత్తి పైరులు నీటి ముంపులోనే ఉన్నాయి. గండ్లు పడి, రోడ్లు కోతకు గురవడంతో నియోజకవర్గంలోని పలు గ్రామాలకు ఇంకా రాకపోకల పునరుద్ధరణ జరగలేదు. కృష్ణా వాటర్ పైపులైన్లు పగిలిపోయి మరమ్మతులు చేపట్టే అవకాశం లేకపోవడంతో తాగునీటి కష్టాలు పలు గ్రామాల ప్రజలను ఇంకా వెంటాడుతున్నాయి. నియోజకవర్గంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వ్యాధులు వ్యాప్తి చెందకుండా వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ మందులను అందిస్తున్నారు. రాజకీయ పార్టీల నాయకులు, దాతలు ముంపు ప్రాంతాల బాధితులకు అన్నదానం చేస్తున్నారు.

చవితి సందడి


నూజివీడులో విక్రయానికి సిద్ధంగా ఉంచిన పూజ సామగ్రి


నూజివీడులో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన వినాయక విగ్రహాలు

తిరువూరు/మైలవరం/నూజివీడు: వినాయక చవితి ఉత్సవాలు శనివారం నుంచి గ్రామాలు, పట్టణాల్లో నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేశాయి. కూడలి ప్రాంతాలు, ఆలయాల వద్ద చలువ పందిళ్లు వేశారు. ఆయా కమిటీల ఆధ్వర్యంలో ఇప్పటికే విగ్రహాలను కొనుగోలు చేసి తీసుకువచ్చారు. పూజా సామగ్రి ధరలు చుక్కలనంటుతున్నాయి. పలుచోట్ల మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా అందజేశారు. ఉత్సవ కమిటీలతో అధికారులు సమావేశాలు నిర్వహించి తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచించారు.

మాజీ ఎంపీ నందిగం సురేష్ అరెస్ట్ హేయం

నూజివీడు: మాజీ ఎంపీ నందిగం సురేష్ అరెస్టును నూజివీడు ఎస్సీ నాయకులు తీవ్రంగా ఖండించారు. వైఎస్సార్ సీపీ నూజివీడు మాదిగ విభాగం అధ్యక్షుడు కంచర్ల లవకుమార్ శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళిత నాయకులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంపై శ్రద్ధ చూపాలన్నారు. దళితులపై తప్పుడు కేసులు పెట్టి వేధించాలని చూస్తే దళితులు తిరుగుబాటు చేస్తారని హెచ్చరించారు. సర్పంచి మల్లయ్య, మాదిగ నాయకులు పాల్గొన్నారు.